www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 9 నవంబరు 2022 5 ఏలూరు



జిల్లాస్థాయి పోటీలకు గురుకుల పాఠశాల విద్యార్థులు


జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని అప్పలరాజుగూడెం బాలుర గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపల్ టి.నరసింహస్వామి తెలిపారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. పాఠశాలలో విద్యార్థులు మండల, నియోజకవర్గ స్థాయిల్లో అండర్-17, అండర్-14 విభాగాల్లో జరిగిన క్రీడల్లో రన్నింగ్, డిస్క్‌త్రో వంటి పోటీల్లో గెలుపొందారన్నారు. వారిలో 11 మంది విద్యార్థులు జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. గెలుపొందిన వారిని, ప్రోత్సహించిన పిఇటి టి.లహరిదుర్గను ఆయన అభినందించారు.

నేటి నుంచి అటవీ శాఖలో నియామక పరీక్షలు

డిఆర్ఒ ఎవివిఎస్ఎన్.మూర్తి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



ఏపిపిఎస్సి ద్వారా అసిస్టెంట్ కన్సర్వేటర్ ఫారెస్ట్ పోస్టుల భర్తీకి ఈ నెల 9 నుండి 11వ తేదీ వరకూ వట్లూరులోని శ్రీ విద్యాలయ జూనియర్ కాలేజీలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లో నియామక పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి ఎవివిఎస్ఎన్.మూర్తి తెలిపారు. మంగళ వారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో పరీక్షల నిర్వహణపై పోలీసు, హెల్త్, విద్యుత్, లైజన్ ఆఫీసర్, ఎపిపిఎస్‌సి ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ అసిస్టెంట్ కన్సర్వేటర్ ఫారెస్ట్ పోస్టుల భర్తీకి పరీక్ష ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకూ నిర్వహిస్తున్నామన్నారు. ఈ పరీక్షలకు 180 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ హాల్ టిక్కెట్‌తో పరీక్షా కేంద్రానికి సమయానికి ముందే హాజరు కావాలని సూచించారు. పోలీస్ శాఖ ద్వారా పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని, మహిళా పోలీసులను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు. అభ్యర్థులు కోవిడ్ నిబంధనలు అనుసరించి మాస్కులు ధరించి పరీక్షా కేంద్రానికి హాజరు కావాలన్నారు. పరీక్షా కేంద్రానికి విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖాధికారులకు సూచించారు. హాల్‌టిక్కెట్‌తోపాటు ఆధార్, పాన్‌కార్డు, ఓటరు ఐడి తదితర వాటిలో ఏదోక గుర్తింపు కార్డును వెంట తీసుకురావాలని తెలిపారు. సమావేశంలో హెల్త్ డిపార్టుమెంట్ తరపున డి.రవీంద్రబాబు, ఎపి ట్రాన్స్‌కో డిఇ ఝాన్సీ, ఎపి పబ్లిక్ సర్వీసు కమిషన్ అసిస్టెంట్ సెక్రటరీ ఎన్.ప్రవీణ, సెక్షన్ ఆఫీసరు టి.విజయలక్ష్మి, పోలీసు అధికారి ఎం.రాజా పాల్గొన్నారు.

వాలంటీర్ సతీష్‌పై దాడి దుర్మార్గం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దళితుడైన వాలంటీర్ పూనూరి సతీష్‌పై దాడి దుర్మార్గమని దళిత సేన రాష్ట్ర అధ్యక్షులు జిజ్జువరపు రవి ప్రకాష్ అన్నారు. స్థానిక సంఘ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోమడవోలు గ్రామానికి చెందిన సతీష్‌పై స్థానిక కార్పొరేటర్ ఆరేపల్లి రాధిక భర్త ఆరేపల్లి సత్తిబాబు మరికొంతమంది అనుచరులు కలిసి అకారణంగా దాడిచేయడం దుర్మార్గమన్నారు. దీనిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేయాలని, అందుకు రాష్ట్ర ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా దళిత యువకుడుపై జరిగిన దాడి విషయంలో పోలీసు యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు లక్కపాము చంటి, బూల్లా రవికుమార్ పాల్గొన్నారు.

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ జిల్లా ప్రతినిధి బృందం స్థానిక పోణంగి వద్ద గల టిడ్కో గృహాలను సందర్శించింది. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించాలని సిపిఐ అనేక పోరాటాలు చేసిందన్నారు. ప్రభుత్వం కేవలం రాజకీయ లబ్ధి కోసం తేదీలను మారుస్తూ టిడ్కో ఇళ్లను ఇవ్వకుండా లబ్ధిదారులను మభ్యపెడుతుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, ఎం.ఎ.హకీమ్ పాల్గొన్నారు.


కరపత్రాలు పంచుతున్న నాయకులు

వ్య.కా.స రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని సంఘం మండల అధ్యక్షులు సత్తు కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. వచ్చేనెల 8,9,10 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో నిర్వహించే ఈ మహాసభ సందర్భంగా ఈదులగూడెంలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎం.బాలయ్య, కె.మంగమ్మ, సుధాకర్, రాఘవులు పాల్గొన్నారు.


లోకేష్‌కు వినతిని అందిస్తున్న నేతలు

లోకేష్‌ను కలిసిన టిడిపి ఎస్‌సి సెల్ నేతలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను ఎస్‌సి సెల్ మండల అధ్యక్షులు నేకూరి ఆశీర్వాదం, పలువురు నాయకులు కలిశారు. మండలంలో అన్ని గ్రామాల్లో కమిటీలు వేయడం, ప్రతీ గ్రామంలో సభ్యత్వాలు, బాదుడే బాదుడు కార్యక్రమాలపై లోకేష్‌కు వివరించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పార్టీని గెలిపించేందుకు కష్టపడి పని చేస్తామని చెప్పారు. లోకేష్‌ను కలిసిన వారిలో నిడమర్రు మండల ఎస్‌సి నేత మంగమూరి రవికుమార్, ఓగిరాల బాబూరావు, జిల్లా నాయకులు దూలపల్లి సోమరాజు, మండా రవి ప్రసాద్ ఉన్నారు.

ఆపదమిత్రలతో ఎంతో మేలు

జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

విపత్తుల సమయాల్లో అండగా నిలిచేందుకు ఆపదమిత్రలు ఎంతగానో దోహదపడతారని జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ అన్నారు. స్థానిక జెవియర్ నగర్‌లోని సోషల్ సర్వీస్ సెంటర్‌లో జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాకు చెందిన ఆపదమిత్ర వాలంటీర్లకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమంలో ఆయన మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ విపత్తు పీడిత జిల్లాల్లో కమ్యూనిటీ వాలంటీర్లకు శిక్షణ ఇచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయన్నారు. దీనిలో మన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకూడా ఉందన్నారు. విపత్తుల సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై 12 రోజులపాటు శిక్షణ ఉంటుందన్నారు. తొలివిడతగా ఏలూరు జిల్లాకు సంబంధించి ఏలూరు జిల్లాలో ఎంపిక చేసిన 250 మందికి 12 రోజులు పాటు సమగ్ర శిక్షణ అందించారన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన 100 మందికి 12 రోజులపాటు శిక్షణా కార్యక్రమం సాగుతుందన్నారు. విపత్తులు సంభవించిన సమయంలో తక్షణం స్పందించేలా ముఖ్యంగా తుఫాను, వరద ప్రభావిత మండలాలు, గ్రామాల్లో ఎంపిక చేసిన కార్యకర్తలకు శిక్షణ అందించేందుకు ప్రభుత్వం ఆపదమిత్ర కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పి సిఇఒ కె.రవికుమార్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డిటిఎం జి.ప్రసంగిరాజు, డిపిఎం రత్నబాబు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్

పాలసానిపల్లిలో సాబ్జీ, వినీత పర్యటన

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని పాలసానిపల్లి గ్రామంలో ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు బూసి వినీత మంగళవారం వేర్వేరుగా పర్యటించారు. ఎంఎల్‌సి తన పర్యటనలో భాగంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.లింగరాజుతో కలిసి పాలసానిపల్లి సర్పంచి షేక్ రహీమాబేగం హసేనాను కలిశారు. ఈ సందర్భంగా గ్రామ పరిధిలో విద్యాపరంగా జరుగుతున్న అభివృద్ధిని సర్పంచి ఎంఎల్‌సికి వివరించారు. అనంతరం ఆయనను సత్కరించారు. ఇక రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు బూసి వినీత, రాష్ట్ర బాలల హక్కుల సంరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ జె.రాజేంద్రప్రసాద్ పాలసానిపల్లిలోని బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించారు. వీరివెంట గురుకుల విద్యాసంస్థల జిల్లా సమన్వయకర్త డాక్టర్ వాసవి, భీమడోలు సిఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ చావా సురేష్ ఉన్నారు. ఈ సందర్భంగా సర్పంచి షేక్ రహీమా బేగం హసేనా అధ్యక్షతన విద్యార్థినులకు వివిధ అంశాలపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హక్కులు, చట్టపరంగా రక్షణ ఇతర అంశాలను వివరించారు. అనంతరం గురుకుల పాఠశాల ఆవరణలో వివిధ విభాగాలను వారు సందర్శించారు. అక్కడ అమలవుతున్న అంశాలను పరిశీలించారు. విద్యార్థినులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. కార్యక్రమంలో గురుకులం ప్రధానోపాధ్యాయిని ఎం.పద్మావతి, ఎంపిటిసి అంబటి దేవి, నాగేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.



పాలసానిపల్లిలోని గురుకుల విద్యాసంస్థను సందర్శిస్తున్న రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యులు, రాష్ట్ర బాలల హక్కుల సంరక్షణ కమిషన్ సభ్యులు, పాలసానిపల్లి సర్పంచి


షేక్ సాబ్జీని సత్కరిస్తున్న సర్పంచి షేక్ రహీమా బేగం హసేన


పార్టీలు చేరిన నాయకులు

సిపిఎంలో పలువురు చేరిక

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలో వైసిపి, టిడిపికి చెందిన పలువురు కార్యకర్తలు, చిన్న సన్నకారు రైతులు సిపిఎంలో చేరినట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి తెల్లం దుర్గారావు తెలిపారు. మండలంలోని జగన్నాథపురంలో జరిగిన సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆధ్వర్యంలో వారిని పార్టీలోకి ఆహ్వానించినట్లు ఆయన చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రవి మాట్లాడుతూ ఏజెన్సీలో గిరిజన, గిరిజనేతర పేద రైతుల మధ్య చిచ్చు పెట్టేందుకు అనేక మంది కుట్ర చేస్తున్నారని విమర్శించారు. గిరిజన, గిరిజనేతర పేదల ఐక్యతతోనే ఇరుపక్షాలకు రక్షణ ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. పేదల భూములు కార్పొరేట్లకు అప్పగించేందుకు పాలక పార్టీలు కుట్ర చేయాలని చూస్తున్నాయని ఆరోపించారు. పేదలకు అండగా సిపిఎం నిలబడుతుందని స్పష్టం చేశారు. సిపిఎం రైతులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై ఎన్నో పోరాటాలు చేస్తూ రైతు పక్షాన నిలబడుతుందని, అందుకే ఆ పార్టీలో చేరినట్లు కొంతమంది రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తెల్లం రామకృష్ణ, మండల కమిటీ సభ్యులు సిరిబత్తుల సీతారామయ్య, అప్పారావు, గుండు గంగరాజు, చిట్టిబొమ్మ కొండలరావు, వంశీ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన 'గడపగడపకూ వైసిపి'


ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పట్టణంలోని 12వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం మంగళవారమూ కొనసాగింది. రామచంద్రపురం మహేంద్ర షోరూం వద్ద నుండి ప్రారంభించిన ఈ కార్యక్రమంలో చింతలపూడి ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలిజా ప్రజలకు పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పార్టీ కార్యకర్తలు నవరత్నాలను అర్హులకు చేరువ చేయడంలో దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, వైస్‌ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, మున్సిపల్ కమిషనర్ పి.భవానీ ప్రసాద్, పట్టణ అధ్యక్షులు చంద్రరావు, రీజనల్ డైరెక్టర్ ఆఫ్ చైల్డ్ అండ్ ఉమెన్ వెల్ఫేర్ వందనపు సాయిబాలపద్మ, కౌన్సిలరు, వాలంటీర్లు, పట్టణ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: అన్యాయంగా రాష్ట్రాన్ని విభజించిన కాంగ్రెస్ భూస్థాపితమై ఫలితం అనుభవిస్తుందని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. మంగళవారం మండలంలోని పరింపూడి సచివాలయం-1 పరిధిలో ఎంపిటిసి గంటా శ్రీనివాస్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ ఏనాడూ స్వతంత్రంగా ఎన్నికల్లో విజయం సాధించి పాలన సాగించలేని చంద్రబాబు ఈదఫా కూడా దత్తపుత్రుడి కోసం తహతహలాడుతున్నారన్నారు. ఈ నాటకాలు రాష్ట్రంలో సాగవని, వైసిపిదే మళ్లీ విజయమని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి గంజిమాల రామారావు, మాజీ ఎంపిపి మట్టా సత్తిపండు, పట్టణ కన్వీనర్ శంకు కొండ, ఎంపిటిసి తేలే శ్రీను, నాయకులు ముప్పిడి వెంకట్రావు, నిక్కర్ నాగేశ్వరరావు, చిడిపి రవి, విగ్గిన రామకృష్ణ, కడిమి సూరిబాబు, నిడదవోలు రాజ్యలక్ష్మి, ఊసల బోసు, తోంటా వాసు, కట్టా రాము, నారా అన్నపూర్ణాదేవి, సోలం వెంకటరమణ పాల్గొన్నారు.


కొయ్యలగూడెం మండలంలో..

ముదినేపల్లి: ప్రజా సంక్షేమమే వైసిపి ధ్యేయమని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని చిగురుకోట సచివాలయం పరిధిలోని చినకామనపూడి, నరసన్నపాలెం గ్రామాల్లో మంగళవారం గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.


ముదినేపల్లి మండలంలో..

వందో రోజుకు గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం వంద రోజుల పండుగకు నియోజకవర్గంలోని నాలుగు మండలాలు నుంచి భారీగా పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ కోరారు. ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం చేపట్టి బుధవారంతో వంద రోజులు పూర్తి చేసుకుంటుందన్నారు. చిగురుకోటలో జరిగే ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరు రావాలని, ఈ కార్యక్రమానికి ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు ముఖ్యఅతిథిగా విచ్చేస్తున్నారని తెలిపారు.


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలి

జగనన్న క్రీడా సంబరాలను ప్రారంభించిన ఎంఎల్ఎ ప్రతాప్

ప్రజాశక్తి - నూజివీడు

నూజివీడు నుండి క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించి విజేతలుగా ఎదగాలని శాసనసభ్యులు మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. పట్టణంలోని ధర్మ అప్పారావు కళాశాల ఆవరణలో మంగళవారం జగనన్న క్రీడా సంబరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ ప్రతాప్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి చదువుతోపాటు క్రీడల పట్ల ప్రతిభ కనపరచాలన్నారు. ప్రస్తుతం నూజివీడులో నిర్వహిస్తున్న కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ టోర్నమెంట్‌లో గెలుపొంది జిల్లా, రాష్ట్ర స్థాయిలను అధిగమించి జాతీయస్థాయిలో విజేతలుగా ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడలతో మానసికోల్లాసంతోపాటు ఉద్యోగాల్లో మెరుగైన అవకాశాలు లభిస్తాయన్నారు. మున్సిపల్ వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ మాట్లాడుతూ యువత ఒక్క క్రికెట్ పట్లే కాక వాలీబాల్, కబడ్డీల్లో ప్రతిభ కనబరిచి నూజివీడు పేరును అంతర్జాతీయ స్థాయిలో నిలపాలని కోరారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకుని అభినందించారు.


బ్యాంకర్లతో సమీక్షిస్తున్న కమిషనర్ షాహిద్

టిడ్కో లబ్ధిదారులకు రుణాలివ్వాలి

ఏలూరు నగర్ కమిషనర్ షేక్ షాహిద్


ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నగరపాల సంస్థ పరిధిలోని టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు త్వరితగతిన రుణాల మంజూరుకు బ్యాంకర్లు సహకరించాలని నగర కమిషనర్ షేక్ షాహిద్ పేర్కొన్నారు. కమిషనర్ ఛాంబర్లో మంగళవారం బ్యాంకు ప్రతినిధులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోణంగి ప్రాంతంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం 80 శాతం పూర్తయిందన్నారు. ఎంఎల్ఎ ఆళ్ల నాని ఆదేశాల మేరకు టిడ్కో కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. 'ఎ' కేటగిరిలోని లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా రూపాయితోనే రిజిస్ట్రేషన్ చేసి లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. 'బి' కేటగిరిలో 384 మంది, 'సి' కేటగిరిలో 720 మంది లబ్ధిదారులున్నారన్నారు. మిగిలిన ఇళ్ల లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేసి ఇళ్ల నిర్మాణానికి తమవంతు బాధ్యతగా బ్యాంకర్లు కృషి చేయాలన్నారు. అర్హులైన జగనన్న తోడు లబ్ధిదారులకు రుణాల మంజూరు విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కమిషనర్ బ్యాంకర్లకు సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ ఎన్‌వి.బాపిరాజు, జిల్లా టిడ్కో ప్రాజెక్ట్ ఆఫీసర్ స్వామి నాయుడు, ఫైనాన్షియల్ కో ఆర్డినేటర్ సుందర్‌రావు, మెప్మా పీడీ ఇమ్మానియేలు, ఎస్‌బిఐ, కెనరా, బ్యాంక్ ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, ఇండియన్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ప్రతినిధులు, పలు బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

సిఐటియు 12వ జిల్లా మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - కుక్కునూరు

ఈనెల 19, 20 తేదీల్లో ఏలూరులో జరిగే సిఐటియు 12వ జిల్లా మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ పిలుపునిచ్చారు. మంగళవారం సిఐటియు మండల కమిటీ సమావేశం సుందరయ్య భవనం ప్రజాసంఘాల కార్యాలయంలో అధ్యక్షులు కుంజ నాగలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నిరంతరం పోరాటాలు చేస్తూ, కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సిఐటియు 12వ జిల్లా మహాసభ ఏలూరులో నిర్వహిస్తున్నారన్నారు. ఈ మహాసభలో మూడేళ్ల పాటు కార్మికుల హక్కుల కోసం చేసిన పోరాటాలు సమీక్షించుకుని దిశా, నిర్దేశం చేస్తారన్నారు. ఈ మహాసభను కార్మికులంతా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు మండల కోశాధికారి బి.సుజాత, సహాయ కార్యదర్శులు మేడవరపు రమాదేవి, శ్రావణి, సభ్యులు ఆర్‌వి.రమణ, గ్రేసీ, టి.సురేష్, పద్మ, మంగ, మార్తమ్మ, మంగ పాల్గొన్నారు.


వినతిని అందిస్తున్న నాయకులు

విఆర్ఒల సమస్యలు పరిష్కరించాలని వినతి


ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించడంలో విఆర్ఒలు కీలకబాధ్యత వహిస్తూ సేవలందిస్తున్నారని జంగారెడ్డిగూడెం డివిజన్ విఆర్ఒ యూనియన్ అధ్యక్షులు అడపా రాంబాబు అన్నారు. మంగళవారం ఆర్‌డిఒ ఝాన్సీ రాణికి విఆర్ఒల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ విఆర్ఒలు రెవెన్యూ సేవలందించడంలో సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి లాప్‌టాప్ సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. అలాగే స్టేషనరీ రికార్డుల ఖర్చులను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కొయ్యలగూడెం మండల అధ్యక్షులు పి.ఏసుబాబు, జంగారెడ్డిగూడెం మండల అధ్యక్షులు జిల్లా బాబూరావు, పలువురు విఆర్ఒలు పాల్గొన్నారు.

ఆకతాయిల నుంచి రక్షణ కల్పించండి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆకతాయిల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ హమాలీ కాలనీ కమిటీ (ఐఎఫ్‌టియు) ఆధ్వర్యంలో మంగళవారం కొమడవోలు హమాలీ కాలనీలో నిరసన కార్యక్రమం చేపట్టారు. తమ కాలనీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలనీ, రోడ్లు, డ్రెయిన్లు, విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించాలని, మహిళల రక్షణ బాధ్యతను ప్రభుత్వం తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారికి మద్దతుగా కొమడవోలు స్థానిక ప్రజలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యార్డ్ హమాలీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మంగరాజు రాము అధ్యక్షతన జరిగిన సభలో కొమడోలు మాజీ ఎంపిటిసి వీరంకి భాస్కర్‌రావు, ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు, నగర ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, కాలనీ మహిళలు పల్లి పద్మ, చల్లా సావిత్రి, చల్లా వాణి, చిప్పాడ ఆదిలక్ష్మి మాట్లాడారు. హమాలీ కార్మికులు శ్రమతో ఏర్పాటు చేసుకున్న ఈ కాలనీలో మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని వివరించారు. తమ కాలనీలోకి కొంతమంది అరాచక వ్యక్తులు ప్రవేశించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. స్థానిక ప్రజలు యాదగిరి చినబాబు, మిడతా నటరాజ్, యార్లగడ్డ నాగరాజు, తాతా శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నాడు-నేడు పనులపై సమీక్షిస్తున్న ఎం.రాజు

నాడు - నేడు పనులు నాణ్యంగా ఉండాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

నాడు-నేడు పనులపై మండల విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ ఉండాలని డివిజనల్ అభివృద్ధి అధికారి ఎం.రాజు సూచించారు. మంగళవారం డివిజన్ పరిధిలోని మండల విద్యాశాఖ అధికారులతో నాడు-నేడు పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజనల్ అభివృద్ధి అధికారి ఎం రాజు మాట్లాడుతూ మండల విద్యాశాఖాధికారులు తమ పరిధిలోని పాఠశాలల్లో జరుగుతున్న పనులను స్వయంగా పర్యవేక్షించాలన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పక పాటించాలన్నారు. నాడు-నేడు పనులను సకాలంలో ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డివిజన్ పరిధిలోని మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న కెవిపిఎస్ నాయకులు, దళితులు

వాలంటీరుపై దాడి దారుణం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఏలూరులో వాలంటీరుపై దాడిచేసిన ఏలూరు ఒకటో డివిజన్ కార్పొరేటర్ ఆరేపల్లి అనురాధ ఆమె భర్త సత్తిబాబు సోదరుడు హరిబాబును అరెస్టు చేయాలని బుట్టాయగూడెం రాజీవ్ నగర్ కాలనీ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ దళితులపై దాడులు పెరిగాయన్నారు. దాడిచేసిన వారిని గుర్తించి అరెస్ట్ చేయాలని, ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. దళితుల పట్ల స్థానిక ఎమ్మెల్యే వివక్ష వీడాలని, దోషులను కాపాడే ప్రయత్నాన్ని విరమించుకోవాలని, లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. హరిబాబును, సత్తిబాబును అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జి.సురేష్, రాజు, చంద్రరావు, మురళీ, మంగ, నాగేంద్ర, నాగేశ్వరావు, కుమారి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి శాంతి

పౌష్టికాహారం వినియోగించుకోవాలి


ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి కారం శాంతి అన్నారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్లతో ఆమె మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఐసిడిఎస్ పథకాలను ప్రజలకు వివరించాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో మెను ప్రకారం గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు ఆహార పదార్థాలు అందించాలన్నారు. పాలు, గుడ్లు, ఇతర పదార్థాలు సక్రమంగా అందించాలన్నారు. పారదర్శకంగా రిజిష్టర్ ఉండాలని, స్కూల్ ఆవరణ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

ఆక్రమణలు తొలగించండి : సిపిఎం

ప్రజాశక్తి - నిడమర్రు

పంట కాలువపై ఆక్రమణలు తొలగించి, సర్వే చేసి హద్దులు ఏర్పాటు చేయాలని సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలలుగా ఈ సమస్యపై పోరాడుతున్నా అధికారులు, ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. భువనపల్లి రైతులు స్పందనలో ఫిర్యాదు సైతం చేశారన్నారు. ఈ కాలువ పరిధిలో వంద మంది రైతులు సుమారు రెండు వేలక ఎకరాల్లో పంటలు సాగుచేస్తున్నారన్నారు. ఆక్రమణలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు పొలాలకు వెళ్లి వచ్చేందుకు అవస్థలు పడుతున్నారని, నీటి పారుదలకు కూడా ఆటంకం కలుగుతుందని తెలిపారు.



సచివాలయ ఉద్యోగులతో స్నేహన్

సచివాలయ ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సచివాలయ ఉద్యోగులు అంకిత భావంతో కృషి చేయాలని సచివాలయాల శాఖ సామాజిక పరివర్తన మార్పు సమాచార విభాగం జిల్లా సమన్వయకర్త టిఎన్.స్నేహన్ అభిప్రాయ పడ్డారు. ఆ విధంగా ఏలూరు జిల్లాను రక్త హీనత రహిత జిల్లాగా మార్చటానికి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. మంగళవారం మండలంలోని నాలుగు గ్రామాల్లో ఆయన పర్యటించారు. నిమ్మలగూడెం, నందాపురం, కె.బొత్తప్పగూడెం, పెద కాపవరం గ్రామాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో నిమ్మలగూడెం గ్రామ సర్పంచి బున్ని బుచ్చిరాజు, సచివాలయ కార్యదర్శి రహిదా షేక్, ఎఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధురాలి ఇంటిలో చోరీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

స్థానిక అంబేద్కర్ కాలనీలోని వృద్ధురాలి ఇంటిలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కాలనీకి చెందిన వృద్ధురాలు పలవర్తి లలిత(60) ఒంటరిగా జీవిస్తుంది. గుడివాడ రోడ్డులో చర్చి ఎదురుగా ఉన్న బడ్డీలో నివాసం ఉంటుంది. ఎదురుగా ఉన్న చర్చిలో రాత్రి జరిగే ప్రార్థనకు వెళ్లింది. వచ్చిచూసే సరికి బడ్డీ తాళాలు పగులు కొట్టి, పెట్టెలోని రూ.20 వేలు నగదు, ఇతర వస్తువులు అపహరణకు గురయ్యాయి. వెంటనే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అభివృద్ధిలో ప్రణాళిక విభాగం పాత్ర అమూల్యం

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

సమాజంలో ప్రాంతాల అభివృద్ధికి, ప్రజలకు నివాసయోగ్యమైన పరిస్థితులను కల్పించడానికి ప్రణాళిక విభాగం ఎంతో ప్రాముఖ్యమైనదని నగర కమిషనర్ షేక్ షాహిద్ అన్నారు.కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం పట్టణ ప్రణాళిక దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడుతూ భవిష్యత్ తరాలు నివసించే స్థలాల రూపకల్పనలో ప్రణాళిక విభాగంపాత్ర చాలా ముఖ్యమైనదన్నారు. ప్రణాళిక విభాగం విధి విధానాలను అమలు చేయడంలో ప్లానర్ల పాత్ర గర్వించదగ్గ విషయమన్నారు. గ్రామీణ, పట్టణ, నగర ప్రాంతాల అభివృద్ధి, పర్యావరణ పరిస్థితులు, ఆధునిక వ్యక్తిత్వం, ఏకరూపత, వైవిధ్య పట్టణాల అభివృద్ధి విషయంలో ప్రణాళిక విభాగం ముందుంటుందని కమిషనర్ షాహిద్ తెలిపారు. అనంతరం టౌన్ ప్లానింగ్ విభాగంలో అధికారులు ఏర్పాటు చేసిన కేక్‌ని కట్‌చేసి కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో కమిషనర్ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శాంతిలత, టిపి ఎస్ శ్రీనివాస్, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ చాందిని, పట్టణ ప్రణాళిక విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌టిఎ కార్యాలయం మార్పు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయాన్ని బైపాస్ రోడ్ టాఫె ట్రాక్టర్ షోరూమ్ సమీపంలో ఉన్న అద్దె భవనంలోకి మార్పు చేస్తున్నామని అర్‌టిఎ ఎమ్‌డి మధాని తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ఈనెల పదో తేదీ నుంచి ఎల్‌ఎల్‌అర్ పరీక్షలు, డ్రైవింగ్ టెస్టులు, వాహన కండిషన్ పరీక్షలు, ఇతర సేవలను నూతన కార్యాలయంలోనే నిర్వహిస్తామని పేర్కొన్నారు. వినియోగదారులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా అర్‌టిఎ కార్యాలయంలో సేవలు పొందాలని మదానీ సూచించారు.

జగన్ బాటలోనే పయనం : గంజిమాల

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ప్రజాసేవలో ఆటుపోట్లను ఎదుర్కొంటూ ముందుకుసాగుతున్న సిఎం జగన్ బాటలోనే పయనిస్తామని పశ్చిమ డెల్టా బోర్డు ఛైర్‌పర్సన్ గంజిమాల దేవి అన్నారు. మంగళవారం కొయ్యలగూడెంలోని ఆమె నివాసంలో వైసిపి నేతలు దేవి పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు మాట్లాడారు. ఈ సందర్భంగా ఇటీవల ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్న వైసిపి కార్యకర్త ఊసల తేజస్‌కు దేవి దంపతులు రూ.పదివేలు సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పోతన తాతారావు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి విష్ణు, మండల కన్వీనర్ నాగేశ్వరరావు, వైస్ ఎంపిపిలు తుమ్మలపల్లి గంగరాజు, మట్ట వనజ లక్ష్మి, వైసిపి నాయకులు తేలే శ్రీను, మారిశెట్టి శ్రీను, విగ్గిన రామకృష్ణ, గాడిచర్ల సోమేశ్వరరావు, తోట జయబాబు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయం

టిడిపి మండల ప్రధానకార్యదర్శి కోండ్రు దేవ

చిట్-చాట్

ప్రజాశక్తి - చింతలపూడి



2024 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి విజయం ఖాయమని, వైసిపి ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు విసిగిపోయారని, ఆ పార్టీకి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని టిడిపి చింతలపూడి మండల ప్రధాన కార్యదర్శి కోండ్రు దేవ అన్నారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబును గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు. చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ టిక్కెట్ ఆశిస్తున్న దేవ ప్రజాశక్తితో మాట్లాడారు.

ప్రశ్న : పార్టీలో ఎంతకాలంగా పనిచేస్తున్నారు?

30 ఏళ్లుగా టిడిపిలో కొనసాగుతున్నాను. అనేక సేవా కార్యక్రమాలతో పాటు, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ముందుకుసాగుతున్నాను. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నాను.

ప్రశ్న : గత ఎన్నికల్లో పార్టీ ఓటమి ఎలా అనిపించింది?

రాజకీయాల్లో గెలుపోటములు సహజం. టిడిపికి ఆ సమయంలో వ్యతిరేక పవనాలు వీచాయి. ఆ తర్వాత జరిగిన పంచాయతీ ఎన్నికల్లో సర్పంచి అభ్యర్థిగా నిలబడి, అధికార పార్టీని ఎదిరించి, గెలుపు అంచుల వరకూ వెళ్లాను. ఓటమి బాధించలేదు. పార్టీ ఏ పరిస్థితిలో ఉన్నా గెలుపు కోసమే పనిచేస్తాను.

ప్రశ్న : అధికార పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి ఎలా తీసుకెళు తున్నారు?

ప్రభుత్వ వైఫల్యాలను కిందిస్థాయి వరకూ తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాం. ముఖ్యంగా ప్రతిపక్షంపై ప్రభుత్వ కక్షసాధింపు చర్యలను ప్రజలు కూడా గమనిస్తున్నారు.

ప్రశ్న : నియోజకవర్గ ముఖ్యనేతలు పార్టీ అభివృద్ధికి ఎలా కష్టపడుతున్నారు?

ఈ నియోజకవర్గంలో సీనియర్ నాయకులు గ్రామీణస్థాయిలో పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జగ్గవరపు ముత్తారెడ్డి, ఘంటా మురళీ, మాటూరి వెంకటరామయ్య, నాలుగు మండలాల అధ్యక్షులు, సీనియర్ నాయకులు పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారు.

ప్రశ్న : ప్రజల అభిమానం పొందేందుకు ఏ విధంగా ముందుకెళ్తున్నారు?

ప్రజాసమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పోరాడుతున్నాం. ముఖ్యంగా వైసిపి వైఫల్యాలను ఎండగడుతూ ముందుకుసాగుతున్నాం. రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. అభివృద్ధిలో నియోజకవర్గం బాగావెనుకబడింది. ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. వారి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి అధికారపార్టీతో పోరాడి పరిష్కారానికి కృషి చేస్తున్నాం. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర ధరలు, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు, పన్నుల భారాలతో జనంక సతమతమవుతున్నారు. తమ ప్రభుత్వం రాగానే ప్రతీఏడాది జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామన్నారు. మూడేళ్లయినా ఒక్క జాబ్ క్యాలెండర్ కూడా పూర్తిస్థాయిలో విడుదల చేసి, ఉద్యోగాలు కల్పించలేదు. నిరుద్యోగం పెరిగిపోయింది. అన్ని శాఖల్లోనూ ఖాళీలున్నాయి. ఉన్న సిబ్బందిపై పనిభారం పడుతోంది. సకాలంలో వేతనాలు రాక ఉద్యోగులు, కార్మికులు నానా అవస్థలు పడుతున్నారు. నిరుద్యోగులు, ఉపాధ్యాయులు చాలా నిరుత్సాహంతో ఉన్నారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారు. ఎప్పటికప్పుడు ప్రజలకు వీటిని వివరిస్తూ ముందుకుసాగుతున్నాం.

ప్రశ్న : మీ లక్ష్యం ఏమిటి? తమరు ఏమైనా ఎంఎల్ఎ టిక్కెట్ ఆసిస్తున్నారా?

మా లక్ష్యం చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేయడమే. ఆ తరువాత యువతకు ఇచ్చే అవకాశాలు బట్టి నాకు అవకాశం వస్తే అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్నాను. అధిష్టానం నిర్ణయమే తుది నిర్ణయం.

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం




పతాకాన్ని ఆవిష్కరిస్తున్న అంగన్‌వాడీలు

అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు కె.విజయలక్ష్మి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం అంగన్‌వాడీ యూనియన్ ప్రాజెక్ట్ ఆరో మహాసభ స్థానిక సిఐటియు కార్యాలయంలో షేక్ నూర్జహాన్ అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభనుద్దేశించి విజయలక్ష్మి మాట్లాడుతూ అంగన్‌వాడీలతో వెట్టిచాకిరీ చేయిస్తూ ప్రభుత్వం వారి పట్ల అత్యంత నిరంకుశత్వంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్నా రేషన్‌ను డిపో వద్దకు వెళ్లి అంగన్‌వాడీలు తెచ్చుకోవాల్సి రావడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆమె తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్లకు ఇస్తున్న రేషన్ బియ్యం సెంటర్ వద్దకు తీసుకొచ్చి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొన్ని మినీ సెంటర్లు ఇప్పటికీ అద్దె భవనాల్లో నడుపుతున్నారని, వాటికి అద్దెలు చెల్లించడం లేదని, ప్రభుత్వం అద్దె బకాయిలను చెల్లించాలన్నారు. మెనూ ప్రకారం వంట చేయాలంటే ప్రభుత్వం ఇచ్చే సొమ్ములకు, పెరిగిన ధరలకు పొంతన లేదన్నారు. మెనూ ఛార్జీలు, గ్యాస్ బిల్లులు కూడా పెంచాలన్నారు. అనంతరం సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి మాట్లాడుతూ వైసిపి అధికారంలో రాగానే అంగన్వాడీలకు వేతనాలు పెంచుతామని మభ్యపెట్టిన ప్రభుత్వం వారిపై పనిభారాన్ని పెంచిందన్నారు. కనీసం సంక్షేమ పథకాలు కూడా అమలు చేయడం లేదన్నారు. అంగన్వాడీలపై రాజకీయ వేధింపులు పెరిగాయని, వాటిని ఆపాలన్నారు. బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికుల పట్ల అత్యంత నిరంకుశత్వంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. ఈనెల 19, 20 తేదీల్లో ఏలూరులో జరిగే సిఐటియు జిల్లా మహాసభను, జనవరి 2, 3, 4 తేదీల్లో భీమవరంలో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నూతన కమిటీఎన్నిక

ప్రాజెక్ట్ గౌరవ అధ్యక్షులుగా పోడియం రాజు, అధ్యక్షులుగా ఎం.నాగమణి, ఉపాధ్యక్షులు ఎం.రామయమ్మ, కార్యదర్శి కృపామణి, సహాయ కార్యదర్శి పి.నూర్జహాన్, కోశాధికారి ఆర్.వరలక్ష్మి, పదిమంది కమిటీ సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు.




ఆర్థికసాయం చేస్తున్న దాతలు

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడానికి ప్రతిఒక్కరూ ముందుకు రావాలని కాపు సంక్షేమ సేన కొయ్యలగూడెం మండల అధ్యక్షులు సంకు మధుబాబు అన్నారు. మంగళవారం మండలంలోని రామనుజపురం గ్రామానికి చెందిన బండారు నరేష్ ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందడంతో ఆ కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండారు నరేష్ తాపీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడని, విద్యుత్‌వైర్లు తగిలి ప్రాణం కోల్పోయాడన్నారు. కాపు సంక్షేమ సేన ద్వారా కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని తెలుసుకుని కాపు సంక్షేమ సేన కొయ్యలగూడెం మండల ప్రెసిడెంట్ సంకు మధుబాబు, కొండలరావు మాస్టర్‌కు పరిస్థితిని వివరించామని, ఆయన స్పందించి ఎన్‌ఆర్‌ఐ రామిశెట్టి మురళికి పరిస్థితి వివరించడంతో నరేష్ కుటుంబానికి రూ.ఐదు వేలు సహాయం అందించారని తెలిపారు.



సిఎం జగన్‌ను కలిసిన దేశిరెడ్డి

ఎపి కోఆపరేటివ్ ఛైర్మన్‌గా దేశిరెడ్డి నియామకం

ప్రజాశక్తి - చాట్రాయి

ఎపి కో ఆపరేటివ్ ఛైర్మన్‌గా బూరుగుగూడెం గ్రామానికి చెందిన దేశిరెడ్డి రాఘవరెడ్డి నియమితులయ్యారు. 40 ఏళ్లుగా కాంగ్రెస్, వైసిపిలో అనేక పదవులు చేపట్టి, సర్పంచిగా, సొసైటీ అధ్యక్షులుగా, జెడ్‌పిటిసి సభ్యులుగా పనిచేసి మంచి పేరుప్రఖ్యాతలు సంపాదించుకున్న రాఘవరెడ్డిని గుర్తించి వైసిపి ప్రభుత్వం ఛైర్మన్‌గా నియమించింది. ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో సిఎం జగన్ ద్వారా నియామక పత్రాన్ని అందుకున్నారు.

సుప్రీంకోర్టు నిర్ణయంపై కాపు సంక్షేమ సేన హర్షం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇడబ్ల్యుఎస్‌లకు పది శాతం రిజర్వేషన్ల అమలును సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం పట్ల కాపుసంక్షేమసేన ఏలూరు జిల్లా అధ్యక్షుడు పులి శ్రీరాములు ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. భారతదేశంలో అగ్రవర్ణాల పేదలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. అగ్రవర్ణాల పేదలకు ఉన్న 10 శాతం రిజర్వేషన్లలో రాష్ట్రంలో కాపులకు ఐదు శాతం రిజర్వేషన్లను గత ప్రభుత్వం ఇచ్చిందని, దాన్ని ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు రాష్ట్రంలో 30 శాతం ఉన్న కాపులకు కనీసం ఐదు శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాపు కులానికి చెందిన మంత్రులు ముఖ్యమంత్రితో మాట్లాడి న్యాయం చేయాలని కోరారు.

డివైఎఫ్ఐపై దాడి కేసులో

ప్రయివేటు స్కూల్ కరస్పాండెంట్‌పై కేసు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

డివైఇఒపై దౌర్జన్యం చేసిన ప్రయివేటు పాఠశాల కరస్పాండెంట్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ సాగర్‌బాబు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఈనెల ఏడో తేదీన డివైఇఒ రామన్న దొర జంగారెడ్డిగూడెంలోని ఎంఇఒ కార్యాలయానికి వచ్చారు. పట్టణంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ జగన్నాథరావును పాఠశాల అనుమతిపత్రాలు చూపాలని కోరారు. అనుమతి పత్రాలు పరిశీలించిన అనంతరం నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. దీంతో నోటీస్ జారీ చేస్తున్నామని చెప్పడంతో రామన్నదొరపై జగన్నాథరావు దౌర్జన్యం చేస్తూ పాఠశాలకు అనుమతులు రాకపోతే చంపుతానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సాగర్ బాబు తెలిపారు.

గొల్లగూడెం 'ఉపాధి' ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేటు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉపాధి హామీ పథకం గొల్లగూడెం ఫీల్డ్ అసిస్టెంట్‌ను తాత్కాలికంగా విధుల నుంచి తొలగిస్తూ డ్వామా అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీచేసినట్లు తెలిసింది. ఆ గ్రామంలో పలు అవకతవకలు జరిగినట్లు గుర్తించి ఆయన్ను తొలగిస్తూ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చినట్లు ఎపిఒ ప్రసన్నరాజు పేర్కొన్నారు.

రోగికి సర్పంచి, ఎంపిటిసి ఆర్థికసాయం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పక్షవాతానికి గురై ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న దర్భగూడెం బిసి కాలనీకి చెందిన నూజేటి సత్యనారాయణకు సర్పంచి సున్నం ఉషారాణి, ఎంపిటిసి కంచర్ల సుధారాణి మందుల నిమిత్తం మంగళవారం ఆర్థిక సాయం చేశారు. అలాగే నిత్యావసర సరుకులు కూడా అందించారు.

అన్నదానం అభినందనీయం

ప్రజాశక్తి - చింతలపూడి

అన్నదానం చేయడం అభినందనీయమని ఎన్‌సిసి లెఫ్టినెంట్ మౌనిక అన్నారు. చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని 19వ ఆంధ్రా బెటాలియన్‌కు చెందిన మౌనిక ఆధ్వర్యంలో ఎన్‌సిసి క్యాడెట్స్‌తో స్థానిక భట్టువారిగూడెంలోని అనాథ శరణాలయం పిల్లలకు ఒక్కరోజు భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో బోటనీ లెక్చరర్ మదన్ మోహన్, ఆశ్రమం ఇన్‌ఛార్జి హిజ్కియా, సత్యనారాయణ పాల్గొన్నారు.

రోగి వైద్యానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ప్రాణపాయ స్థితిలో ఉన్న వ్యక్తికి టిడిపి నేత అర్థిక సాయం అందించారు. ముదినేపల్లికి చెందిన పులి వెంకటేశ్వరరావు (30) అనారోగ్యంతో బాధపడుతూ స్థానిక ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తన అనుచరుల ద్వారా సమాచారం తెలుసుకున్న టిడిపి నాయకుడు కొడాలి వినోద్ మంగళవారం ఆసుపత్రికి వెళ్లి రోగిని పరామర్శించారు. ఆనంతరం వైద్య ఖర్చుల నిమిత్తం రూ.పదివేలు అర్థిక సాయం అందించారు. ఆయన వెంట మధిరి పార్థసారథి ఉన్నారు.

విద్యా వికాస్‌లో ఉత్సాహంగా ఆటల పోటీలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

స్థానిక విద్యా వికాస్ కిడ్స్ క్యాంపస్‌లో విద్యార్థులకు నిర్వహించిన ఆటలు పోటీలు ఆసక్తికరంగా సాగాయి. మంగళవారం విద్యా వికాస్ కిట్ క్యాంపస్‌లో విద్యార్థులకు స్పూన్ అండ్ లెమన్ బ్యాలెన్స్ ఆటలను నిర్వహించారు. ఆసక్తికరంగా సాగిన ఈ ఆటల పోటీలను పలువురు ఆసక్తికరంగా తిలకించారు. పాఠశాల ప్రిన్సిపల్ లక్ష్మీ ప్రసన్న, ప్రసన్న లక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.



లెమన్ స్పూన్ ఆడుతున్న విద్యార్థులు

11న ఆజాద్ జయంత్యుత్సవం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం కలెక్టర్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలామ్ ఆజాద్ జయంతి ఉత్సవం ఈ నెల 11వ తేదీన కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా మైనార్టీస్ సంక్షేమ అధికారి ఎన్ఎస్.కృపావరం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు జిల్లాలోని పురప్రముఖులు, జిల్లా అధికారులు, మైనార్టీ పురప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.